క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్ సబ్ స్టేషన్ పరిధిలోని జవహర్ కాలనీ, విష్ణుపురి కాలనీ, సురేంద్రపురి కాలనీ, మారుతీ కాలనీ, తిరుమల కాలనీ, ఉషోదయ కాలనీ, సదాశివ కాలనీ, ద్వారకసాయి కాలనీ, ఎస్‌వీఎస్ హోమ్స్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. రామన్నపేట, బీట్‌బజార్, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8.30గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు మెగా యోగా క్యాంపు



నయీంనగర్: వికాస తరంగిణి ఆధ్వర్యంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వరంగల్ సీకేఎం కళాశాల మైదానంలో మెగా యోగా క్యాంపు నిర్వహించనున్నట్లు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా యోగా క్యాంపులో త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి, మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో దయాకర్ రెడ్డి, తిరుమల్, విష్ణురెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రస్తావించండి

హన్మకొండ చౌరస్తా: గురువారం జరగనున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రస్తావించి, పరిష్కారం కోసం తీర్మానం చేయాలని సీఐటీయూ, టీఎంఆర్‌పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించే అంశాన్ని కౌన్సిల్‌లో చర్చించాలని సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన మార్నేని



హన్మకొండ: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు కలిశారు. హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో రాజేందర్ రెడ్డిని రవీందర్ రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

'ప్రైవేట్ పాఠశాలల'పై చర్య తీసుకోవాలని వినతి



విద్యారణ్యపురి: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, టీజీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్ హైని బుధవారం కలిసి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం అందరికి సమాన విద్యను అందించాలని సూచించారు. సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు నాగారం మణితేజ, సంతోష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శంభునిపేటకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ 41వ డివిజన్ శంభునిపేటకు చెందిన అబిద్ ఉన్నీస్సా మంగళవారం ఉదయం ఎవరికి చెప్పకుండా ఇంటిలో నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో తల్లిదండ్రులు వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి మహ్మద్ అక్బర్ సర్వర్ బుధవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నాణ్యత పరిశీలించాకే బిల్లులు చెల్లించండి

● కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి: పాఠశాలల్లో చేపట్టిన పనుల నాణ్యతను పరిశీలించిన తర్వాతే బిల్లులు చెల్లించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. హసన్‌పర్తి మండలం హరిశ్చంద్రనాయక్ తండా, అర్వపల్లిలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని సూచించారు. బడీడు పిల్లల్ని బడిలో చేర్పించాలని, ఇందుకు స్థానిక యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈసందర్భంగా పాఠశాలల్లో ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ జరిగిందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్వపల్లి పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ హై, ఎంపీపీ కేతపాక సునీత, ఎంపీడీఓ ప్రవీణ్, ఎంపీఓ రవిబాబు, ఏపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కలెక్టర్‌ను కలిసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సభ్యులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.ప్రావీణ్యను జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ సభ్యుడు, ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాడపాక పరంజ్యోతి, దళిత సంఘాల నాయకుడు వేల్పుల జాన్‌వెస్లీ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్సీఆర్‌పీఎస్ రాష్ట్ర డైరీని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

హన్మకొండ అర్బన్: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు సమ్మె కాలంలో చెల్లించాల్సిన వేతనాలు, ఆరు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సారంగపాణి, రాజుగౌడ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. అలాగే, గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక యూనియన్ జిల్లా నాయకులు సారయ్య, రమేష్, సుధాకర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆ ఎస్సైని కఠినంగా శిక్షించాలి

హన్మకొండ: కామాంధుడిగా మారిన కాటారం సబ్ డివిజన్‌లోని కాళేశ్వరం పోలీసు స్టేషన్ ఎస్సై భవానిసేన్‌ను కఠినంగా శిక్షించాలని చైతన్య మహిళా సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ కళ, కో కన్వీనర్ అనిత కోరారు. తోటి ఉద్యోగిని మహిళ కానిస్టేబుల్‌పై రివాల్వర్‌తో బెదిరించి ఎస్సై భవానిసేన్ గౌడ్ అత్యాచారం చేయడాన్ని చైతన్య మహిళా సంఘం నాయకులు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మహిళ కానిస్టేబుల్‌కే రక్షణ లేకుండా పోయిందంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

ఆశ్రమంలో మానసిక దివ్యాంగుడి అప్పగింత



కాజీపేట: ఇది కావాలని అడగడానికి నోరు లేదు.. రహదారుల వెంట తిరుగుతూ సైగలతోనే అడుక్కు తింటున్న ఓ మానసిక దివ్యాంగుడి దీనస్థితిని చూసి చలించిపోయిన చంద్రశేఖర్ (చందు).. మానసిక దివ్యాంగుల కేంద్రంలో చేర్పించారు. కొద్దిరోజులుగా కాజీపేట పట్టణంలో దాదాపు పాతికేళ్లకు పైగా వయసున్న ఓ యువకుడు మతిస్థిమితం సరిగా లేక పిచ్చోడిలా తిరుగుతుండగా అతడిని చందు బుధవారం చూసి మాట్లాడించడానికి ప్రయత్నించాడు. ఫలితం లేకపోవడంతో యువకుడికి క్షవరం చేయించి నూతన వస్త్రాలు వేయించి ఫాతిమానగర్‌లో క్రైస్తవ సంస్థల ఆధ్వర్యంలోని హౌస్ ఆఫ్ జాయ్ నిర్వాహకులను అప్పగించి ఆశ్రయం కల్పించాలని విజ్ఞప్తి చేయగా వారు ఒప్పుకున్నారు.

కనీస వేతనాల చట్టం అమలులో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

కాజీపేట: కార్మికులకు కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలనే చట్టాన్ని అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి విమర్శించారు. కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కమ్యూనిటీ హాల్‌లో సంఘం ముఖ్య నాయకుల సమావేశాన్ని బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ పోరాటాలతోనే కనీస హక్కులను ఇంకా కాపాడుకోగలుగుతున్నామని అన్నారు. సమావేశంలో ఎం.చుక్కయ్య, ఓరుగంటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాజీపేట సీఐటీయూ మండల కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా కారు ఉపేందర్, కోకన్వీనర్లుగా రామంచ సారంగపాణి, ఎం.యాకూబ్, కమిటీ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తులను నమొద్దు

రామన్నపేట: డబ్బులు డ్రా చేసేటప్పుడు, జమ చేసేటప్పుడు గుర్తు తెలియని వ్యక్తుల సహాయం తీసుకునేటప్పుడు చాలాజాగ్రత్తగా వ్యవహరించాలని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి సూచించారు. ఆయన కథనం ప్రకారం మండిబజార్ నివాసముంటున్న మహ్మద్ అయాజ్ ఈ నెల 6వ తేదీన ఎంజీఎం ఎదురుగా ఉన్న డిపాజిట్ మిషన్‌లో రూ.98 వేల నగదు జమ చేసేందుకు వచ్చారు. ఈ క్రమంలో కొంత నగదును స్వీకరించిన పరికరం కొన్ని నోట్లను తిరస్కరిస్తున్న క్రమంలో వెనుక వరుసలో ఉన్న ఓ వ్యక్తి సహాయం చేస్తానని నమ్మబలికాడు. తన ఖాతాలోకి కొంత నగదును సదరు వ్యక్తి చేసుకున్నాడు. కొంత సమయం తర్వాత రూ.75 వేలు మాత్రమే జమ కావడాన్ని అయాజ్ గమనించి మోసపోయానని తెలుసుకుని ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గోపి వివరించారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

కేయూ క్యాంపస్: డీఎస్సీ పరీక్షను రద్దుచేసి మెగా డీఎస్సీని నిర్వహించాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్‌వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ టెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు డీఎస్సీ ప్రిపరేషన్‌కు తక్కువ సమయం ఉందని, ఈక్రమంలో మెగా డీఎస్సీని నిర్వహించాలని సూచించారు. గత ప్రభుత్వంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైన వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ మచ్చ పవన్‌కల్యాణ్, అధ్యక్షుడు దూడపాక నరేందర్, నాయకులు సంపత్, కె.రాజు, సందీప్, సాయి, చంటి, అనిల్, నరేష్, వెంకటేష్, సురేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

బాలల అక్రమ రవాణాను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు, తదితరులు

ఖిలా వరంగల్: బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణాను అరికట్టాలని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ వరంగల్ కోఆర్డినేటర్ ఈసంపెల్లి సుదర్శన్ సూచించారు. ఖిలా వరంగల్ పడమరకోటలో అంగన్‌వాడీ సెంటర్ నేతృత్వంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు, మహిళల హక్కుల రక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గురువారం జరగనున్న సులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.నరేష్ కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇందిరా, ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సర్టిఫైడ్ కాపీలను అందించాలి



హన్మకొండ చౌరస్తా: డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రమేష్‌బాబును కలెక్టరేట్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కార్పెంటర్ల నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు గత కార్యవర్గాన్ని మార్పుతూ సర్వీస్ రూల్‌లో మార్పులు చేసి సర్టిఫైడ్ కాపీలను అందించాలని డీసీఎల్‌ను కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రాళ్లబండి వీరచారి, కోశాధికారి వేమునూరి సోమేశ్వర్, గౌరవ అధ్యక్షులు వీణవంక సదానందం, చొల్లేటి కృష్ణమాచార్యులు, యూనియన్ నాయకులు లింగాచారి, బ్రహ్మచారి, సంతోష్, రాజేష్, రామకృష్ణ, వెంకన్న, యాకాంతం, చందమౌళి, నాగసోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నగరంలో నాయకులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం అసువులు బాసిన నాన్నమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీ అడుగుజాడల్లో నడిచే సంకల్పం కలిగిన నేత రాహుల్‌గాంధీ అని కొనియాడారు. కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని నాయకులు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

పేద విద్యార్థులకు చేయూతనందిస్తాం

ఖిలా వరంగల్: పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు చేయూతనందిస్తామని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ అన్నారు. రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు జన్మదినం సందర్భంగా ఖిలా వరంగల్ మధ్యకోట అరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు క్రీడా సామగ్రిని బుధవారం అందజేశారు.

పోచమ్మమైదాన్‌లో పండ్ల పంపిణీ

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ప్రజల కోసం నిత్యం శ్రమించే నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అని పార్టీ అధికార ప్రతినిధి తాబేటి వెంకట్‌గౌడ్ అన్నారు. ప్రదీప్‌రావు జన్మదినం సందర్భంగా పోచమ్మమైదాన్ జంక్షన్‌లో 12, 13, 22, 23వ డివిజన్ల పార్టీ అధ్యక్షుల సమక్షంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు.



వరంగల్: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నీట్ పరీక్ష నిర్వహణలో ప్రభుత్వాలు విఫలం

హన్మకొండ: వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో అక్రమాలు, అవకతవకలు జరిగాయనే ప్రచారంతో లక్షలాది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పరీక్షల నిర్వహణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందుతుండడంతో విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ పరీక్ష నిర్వహణలో వైఫల్యం చెందడంతో 24 లక్షల మంది విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్, ర్యాంకుల కేటాయింపులో తలెత్తిన గందరగోళాన్ని పరిష్కరించి విద్యార్థుల్లో పరీక్షల పట్ల నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. పలు రాష్ట్రాల్లోని పబ్లిక్ సర్వీస్ కమిషన్లు కూడా పోటీ పరీక్షలను నిర్వహించడంలో వైఫల్యం చెందుతుండడంతో నిరుద్యోగులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

ముగిసిన మొక్కు'బడి బాట'

● పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఎఫెక్ట్

విద్యారణ్యపురి: ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన బడిబాట మొక్కుబడిగానే బుధవారంతో ముగిసింది. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు తమ పాఠశాలల పరిధిలో బడిబాట ర్యాలీలు, కరపత్రాలు పంపిణీ చేస్తూ.. ఇంటింటా.. ప్రచారం కల్పించారు. బడి బయట ఉన్న విద్యార్థులను బడీడు పిల్లలను గుర్తించేందుకు ఉపక్రమించారు. ఇంతలో ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ఒకే చెప్పింది. షెడ్యూల్ కూడా విడుదలవ్వడంతో ఇక తాము పని చేసే పాఠశాల నుంచి పదోన్నతులు పొందే బదిలీ అయ్యే ఉపాధ్యాయులు బడిబాటపై అంతగా ఆసక్తి కనబర్చలేదని సమాచారం. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో వివిధ కేటగిరీల కలిపి 508 పాఠశాలలున్నాయి. బుధవారం బడి బాట షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించాల్సి ఉండగా.. వివిధ పాఠశాలల్లో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు తాము పనిచేసే పాఠశాలల నుంచి రిలీవ్ అయి తమకు కేటాయించిన పాఠశాలల్లో జాయిన్ అయ్యే ప్రక్రియ కొనసాగింది. అధికారులు కూడా ఎక్కువగా పదోన్నతుల బదిలీల ప్రక్రియపైనే దృష్టిసారించాల్సి రావడంతో బడిబాటను పర్యవేక్షించే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతమేర ఎన్‌రోల్‌మెంట్ జరిగిందనేది డేటా పాఠశాలల హెచ్ఎంల నుంచి డీఈవో కార్యాలయం అధికారులు సమాచారం సేకరించాల్సి ఉంది.

కుల గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

వరంగల్ చౌరస్తా: సామాజిక తరగతులకు సంపదలో, చట్టసభల్లో సమాన వాటాలు దక్కాలంటే తక్షణమే కులగణన చేపట్టి జనాభాకనుగుణంగా రిజర్వేషన్లు ప్రకటించి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.వీరస్వామి, బీఎల్ఎఫ్ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ నర్ర ప్రతాప్ అభిప్రాయపడ్డారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో కుల జనగణన – బీసీ రిజర్వేషన్లు – స్థానిక ఎన్నికలు అనే అంశంపై బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 93శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు చట్టసభల్లో, సంపదలో సమాన వాటా దక్కకుండా అగ్రవర్ణ కుల పాలకులు, కుట్రలు చేస్తున్నారని వాపోయారు. సమావేశంలో ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, తెలంగాణ ఉద్యమకారుల కన్వీనర్ సోమ రామమూర్తి, డీబీఎఫ్ ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, నాయకులు కుసుంబ బాబురావు, కేడల ప్రసాద్, కర్ర రాజిరెడ్డి, దూడల సాంబయ్య, శంకర్ లింగం, పూజారి హరిప్రసాద్, కన్నం వెంకన్న, చాపర్తి కుమార్ గాడ్గే, పెంచాల రాజు పటేల్, సాదుల పూర్ణచందర్, ఎగ్గెని మల్లికార్జున్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరస్వామి

ప్రజల పక్షాన కార్పొరేటర్లు పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్, పక్కన కార్పొరేటర్లు

హన్మకొండ: బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రజల పక్షాన పోరాడాలని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఈనెల 20న జరగనున్న కౌన్సిల్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్‌తో కలిసి వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో, మిగతా సమయంలో అధికారులతో చర్చించాలని సూచించారు. వరదలు, తాగునీటి సరఫరా సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నగరాభివృద్ధికి ప్రభుత్వం నుంచి అదనపు నిధుల మంజూరు కోసం ఒత్తిడి పెంచాలని పేర్కొన్నారు. బడ్జెట్ కూర్పుపై విస్తృతంగా చర్చించాలని కోరారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, కార్పొరేటర్లు మరుపల్లి రవి, ఇండ్ల నాగేశ్వరరావు, బస్వరాజు శిరీష, రాజు, అశోక్ యాదవ్, మనీషా శివకుమార్, బాబు, మనోహర్, సువర్ణ సురేష్, దివ్యరాణి, రాజు నాయక్, రవి నాయక్, మధుసూదన్, కిరణ్, నర్సింగరావు, కుమారస్వామి, లోహిత రాజు, రాధికా రెడ్డి, స్వరూపారాణి, పద్మ, రంజిత్ రావు పాల్గొన్నారు.

నేరెళ్ల వేణుమాధవ్‌కు ఘన నివాళి



వేణుమాధవ్‌కు నివాళులర్పించిన ట్రస్ట్ సభ్యులు

హన్మకొండ కల్చరల్ /హన్మకొండ చౌరస్తా: ధ్వన్యనుకరణ సామ్రాట్, పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ 6వ వర్ధంతి సందర్భంగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేరెళ్ల వేణుమాధవ్ కల్చరల్ ట్రస్ట్ అధ్యక్షురాలు నేరెళ్ల శోభావతి మాట్లాడుతూ మిమిక్రీ కళను మరింతగా అభివృద్ధి చేయాలని కోరారు. వేణుమాధవ్ ఎంచుకున్న మిమిక్రీ కళను భావితరాలకు అందించినప్పుడే ఆయనకు ఘనమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. మిమిక్రీ కళాకారులను అన్ని విధాలుగా ఆదుకోవడంతోపాటు సమాజంలో సముచిత స్థానం కల్పించి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, శాశ్వత సభ్యులు నేరెళ్ల రాధాకృష్ణ, శ్రీలత, వనం లక్ష్మీకాంతారావు, రామచంద్రమౌళి, వరిగొండ కాంతారావు, గన్నమరాజు గిరిజా మనోహర బాబు, కొణతం కృష్ణ, మిమిక్రీ కళాకారుడు అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌కు సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గణిత విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్‌ను పలు విద్యార్థి సంఘాల బాధ్యులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ మంద వీరస్వామి, బీఆర్ఎస్‌వీ నాయకులు డాక్టర్ పాలకుల కొమురయ్య, కలకోట్ల సుమన్, ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ డాక్టర్ వడ్డెపెల్లి మధు, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు నర్సింహారావు, మాదాసి రమేష్, అంబేద్కర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, కేయూ నాయకులు మచ్చ పవన్‌కల్యాణ్, వివిధ సంఘాల బాధ్యులు డాక్టర్ వంగాల సుధాకర్, జీడీ.రమేష్, డాక్టర్ నర్సింహారావు, సోమరాజు, సునీల్, అనిల్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సంఘాల బాధ్యులు

రైలుకింద పడి వృద్ధుడి ఆత్మహత్య

కాశిబుగ్గ: రైలుకింద పడి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ – చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గీసుకొండ మండలం గరీబ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ సుల్తాన్‌ఖాన్(60).. భార్య చనిపోవడంతో కుమారులతో కలిసి ఉంటున్నాడు. కర్ర కోత పనిచేస్తూ ఒంటరితనంలో బాధపడుతూ మద్యం తాగేవాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రైలుకింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈమేరకు హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి పెద్ద కుమారుడు అక్రమ్‌ఖాన్‌కు బుధవారం అప్పటించినట్లు సీఐ వివరించారు.